


—ఎమ్మెస్సార్ మూర్తి

"ఈ. సి. ఐ. ఎల్ లో ఇంటర్వ్యూకి వచ్చాను. నా ఎంప్లాయిమెంట్ నంబర్‌లో ఏదో తప్పుందని, సరిచేసుకు వస్తేనేగానీ ఇంటర్వ్యూ ఇవ్వమనీ అన్నారు. ఆ వెంటనే మౌలాలీనుంచి ఈ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌దాకా సిటీ బస్సులు మారుకుంటూ వచ్చాను... ఏ బస్సులో

కొట్టేసేరో ... నా పర్సు మాయమైంది..."

ఇలా అరటిపండు వలిచినట్లు చెప్తున్నా ఆ మార్వాడీ వినలేదు' తన వళ్ళో ఉన్న మనవరాలి పాంట్ జేబులు సవరిస్తూ...

"ఈ ఊళ్ళో తెలిసిన వాళ్ళెవరైనా ఉన్నారా?" అని గుజరాతీ—హిందీలో అడిగాడు.

"ఉన్నారు. కానీ ఏమిటి ప్రయోజనం? వాళ్ళని తీసుకురావాలంటే నేను బస్‌లో బయలుదేరాలి. వాళ్ళని తీసుకొచ్చి నీకు చూపించేలోపల ఆ యింటర్వ్యూ కాస్తా అయిపోతుంది. అందుకేగా వేలి వుంగరం తీస్తున్నది," అన్నాను నేను.

"ఏవోఁ, ఎక్కణ్ణుంచైనా దొంగతనంగా పట్టుకొచ్చేవేమో"

అంత నిర్మొహమాటంగానూ అన్న అతగాడి హిందీ నాకు అర్థమైంది. ఇక నేను రోడ్డున పడక తప్పలేదు. ఇంటర్వ్యూకి అందుకోవాలంటే వెనక్కి వెళ్ళాలి. వెనక్కి వెళ్ళాలంటే డబ్బు కావాలి. ఏం చేయటమా అని ఆలోచిస్తూ నా ఉంగరాన్ని వేలికి పెట్టుకున్నాను. నాన్న పెళ్ళికి అమ్మమ్మ పెట్టినదట. అంత తేలిగ్గా పోతుందా?

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. మనసంతా చిందరవందరగా ఉంది. ఎదురుగా ఒంటరిగా వస్తున్న అమ్మాయిని ఎలా ఆపానో నాకే తెలియదు.

"చెప్పండి" అంది.

"మీరు ఈ ఊళ్ళోనే ఉంటున్నారుగదూ?" తడబడుతూనే అన్నాను.

"అవును" నింపాదిగా అంది, ఎరగని నన్ను పోల్చుకోనడానికి ప్రయత్నిస్తూ.

"ఓ చిన్న సహాయం చేసి పెట్టండి. నాకు అర్జంటుగా పైకం కావలసి వచ్చింది."

బిత్తర పోయినట్టు చూసింది ఆమె నా వంక.

"అబ్బెబ్బె... అది కాదు. నా పేరు ఈశ్వర్రాజు. ఇ.సి.ఐ.ఎల్‌లో ఇంటర్వ్యూకి వచ్చాను. ఇదిగో ... ఈ ఉంగరం..." వేలి నుంచి లాగుతుంటే ఉంగరం జారి కింద పడింది.

తను వంగింది. ఉంగరాన్ని తీసి పైటతో తుడిచి నా చేతికిచ్చింది.

"థాంక్స్... ఆఁ... ఈ ఉంగరం తాకట్టు పెడతానంటే తెలిసిన వాళ్ళు కావాలంటున్నాడు మార్వాడీవాడు. మీరు ఏమనుకోకపోతే..." నేనంతా చెప్పగలిగానే అనుకున్నాను.

నన్ను కొంచెం పరిశీలనగా చూస్తూ, నా ఎడమ చేతిలోని

షెలుని చూసి, "పదండి" అంది.

నా మనసు కుదుట పడింది. ఆమె ఏమనుకుంటుందో అని నేను వెనగ్గా నడుస్తున్నాను. మామూలు చెప్పులు వేసుకుంది. తెల్లటి చీర అంచులు కొంచెం మాసి ఉన్నాయి. తల వంచుకునే వెళ్తోంది. నేను అనుసరిస్తున్నాను.

మార్వాడీకొట్టు దగ్గరే ఆగింది. తను ముందు — నేను వెనుకా మెట్లెక్కాం.

ఇప్పుడు త్రాసు ముందర కూర్చున్నది ఇందాకటి ముసలాడు కాదు. వాడి కొడుకై ఉంటాడు.

"జైకీయే" అన్నాడు మర్యాదగా.

చదువుకున్నాడిలా అవుపిస్తున్నాడు. మంచివాడనుకుని కూర్చున్నాను.

ఆ అమ్మాయి కూర్చోలేదు. కూర్చుంటుంది అనికూడా నేననుకోలేదు,

కుడిచేతి గుప్పిట్లో ఉండాల్సిన నా ఉంగరాన్ని జేబులో ఎప్పుడు వేసుకున్నానబ్బా... కొంపదీసి ......అది పోయిందేమోనన్న కంగారుతో వెతికి, ఎడంవేపు పాంటు జేబులో చిక్కించుకున్నాను. అది నా చేతికి తగిలింతర్వాత ప్రాణాలు కుదట బడ్డాయి. చేతిలోకి తీసుకున్నాను.

ఈ కంగారులో నేనసలు గమనించలేదు. ఆ ఇత్తడి త్రాసు ఉన్న షోకేసు గాజు పలకమీద ఓ చెవుకి పెట్టుకునే రింగు వుంది. ఆమెని చూశాను యాంత్రికంగా.

కుడి చెవి రింగుని కూడా తియ్యడానికి ఆమె ప్రయత్నిస్తోంది.

కోలముఖం — గడ్డం క్రింద అందంగా ఓ చిన్న పుట్టుమచ్చ. ధ్యాసంతా రింగు తీయడంలో నిమగ్నమైంది గనక అందమైన కళ్ళు సగం మూతపడుతూ మరింత విశాలంగా కన్పించాయి. పల్చటి నేత-చీర. మొత్తానికి రెండో రింగు కూడా తీసింది.

నాకు ఆశ్చర్యం వేసింది. అంటే తనకికూడా... చెవుల మీదికి జారిన జుట్టుని సవరించుకుంటూ అలవోకగా నిలబడింది.

అవి చేతిలోకి తీసుకున్నాడు మార్వాడీ కుర్రాడు. వజ్రాల్లాంటి అతని కళ్ళు రింగుల్లోని బంగారాన్ని పరిశీలించాయి, ధర నిర్ణయించేశాయి. రోజూరంగు రసీదు పుస్తకం మీద గుజరాతీలో రాసుకుపోతున్న అతను తలవంచుకునే అడిగాడు.

"నామ్...?"

"సత్యవతి"

"పతీకానామ్...?"

నేను విన్నాను. తనూ వినడం

గమనించాను. తన ముఖంలో చలనంలేదు. పైకి చూసింది.

రసీదు మీద అనవసరంగా చుక్కలు పెడుతున్న కుర్రాడు. తల పైకెత్తి ఆ అమ్మాయికి హిందీ రాదేమోనన్నట్టుగా తనకొచ్చిన తెలుగులో "మగని పేరు...?" అని అడిగాడు.

సత్యవతి వాణ్ణి కసిగా చూసింది.

నా వేపు తిరిగింది. ఎర్రటి పొడ వాటి బోసిపోతున్న ఆమె మెడ ఎడారిలో పారేసిన శంఖంలాగా ఉంది.

నా వేపు జాలిగా చూసింది. కళ్లు ఆర్పిందనుకుంటాను కానీ వెంటనే ...జవాబు కోసం ఎదురు చూస్తూన్న ఆ కుర్రాడి వేపు తిరిగి "ఈశ్వరరావు" అనడం మాత్రం నేను స్పష్టంగా వినక తప్పలేదు—అది నా పేరు కనక —బిత్తరపోయాను.

వెంటనే ఏదో అడ్రసు కూడా చెప్పింది. నేను ఆమెను తదేకంగా చూస్తూన్నాను విస్తుపోయి. ఆమె మాత్రం ముఖం ఇటు తిప్పలేదు. వాడు ఎంతో చెప్పాడు. తలూపింది.

ఇచ్చాడు. మౌనంగా తీసుకుంది.

నేను హాయిగా ఊపిరి పీల్చుకునేందుకు పైకి చూశాను. తిరిగి చూసేసరికి సంతకం కోసం ఇచ్చిన కలాన్ని గాబోలు తిరిగి ఇచ్చేస్తోంది. రసీదులో పైకం మడతబెట్టుకుంటూ నా వేపు తిరిగింది.

నన్ను చూసి పేలవంగా నవ్వి బయటికి నడిచింది. ఆ తరవాత మార్వాడీ కుర్రాడు నా వంక చూశాడు. నేను వుంగరాన్ని తీసి అతడికిచ్చి "నాకు కూడా ఏదైనా యిచ్చి పంపండి" అన్నాను.

నన్నూ, ఉంగరాన్ని ఓ చూపు చూసి "భార్యా భర్తలు కీచులాడుకుని ఎవరికి తోచింది వారు మార్వాడీ కొట్లో పారేస్తున్నట్టున్నారు" అంటూ ఉంగరాన్ని గల్లాలో వేసుకుని పుస్తకం నా వైపుకు జరిపాడు.

పుస్తకం మీదున్న బాల్ పాయింట్ పెన్ని తీసుకుని సంతకం చేసి పైపక్క ఆమె వ్రాసిన ఎడ్రస్, నా పేరు క్రింద వ్రాశాను. ఆ ఎడ్రసు చూసి వాడు మరోసారి నవ్వి డబ్బు నా చేతిలో పెట్టాడు. క్షణంలో బయట పడ్డాను.

నాకు గాల్లో తేలిపోతున్నట్టు గానూ ఉంది. పాతాళంలోకి దిగుతున్నట్టుగానూ ఉంది.

నేను మెట్లన్నీ దిగాక గాని చూళ్ళేదు ఆమె యింకా నా కోసం నిలబడే ఉందని.

దగ్గరగా వెళ్ళాను థాంక్స్ చెప్పడానికి. తన కళ్ళల్లోకి సూటిగా చూద్దామనుకున్నప్పుడే తనూ నన్ను సూటిగా చూసింది. సన్నగా నవ్వి "థాంక్స్" అంది. నేనుతలఎత్తేసరికి సత్యవతి వెళ్తోంది నాన్న పెళ్ళికి అమ్మమ్మ చేయించిన నా వుంగరాన్ని వదిలి వెళ్ళలేక... ఆ మార్వాడీ కొట్టుని గుర్తుంచుకుందామని కొట్టు వేపు చూశాను. నావుంగరాన్ని, సత్యవతి రంగుల్ని ఓ పచ్చ దారంతో గట్టిగా బిగించే ప్రయత్నంలోవున్న ఆ మార్వాడీ కుర్రాడు కనిపించాడు.

నన్ను ఒకసారి దగ్గరకు రమ్మన్నట్టు సైగ జేసి, "మీ శ్రీమతిగారి మెళ్ళో పుస్తె కనిపించలేదు. బహుశా ఎక్కడో తాకట్టు పెట్టి వుంటారనుకుంటాను. మళ్ళీ ఏదైనా తాకట్టు పెట్ట దలచినప్పుడు నన్ను మర్చిపోకండి. ఇక్కడికే రండి" అన్నాడు వాడు. *

---

# మలుపు

(63 వ పేజీ తరువాయి)

నళిని పెళ్ళి చెడగొట్టాలి. తన కసి తీరాలి!

....కాని, కాని....

శ్రీధర్ నిట్టూర్చాడు. ఓ ఆడపిల్ల అన్నగా తనెంత క్షోభ అనుభవించాడిందాక?! కుమార్ అన్నాడు— "నా స్థితిలో మీరు ఉంటే....?"

"ఉన్నాను కుమార్! నీ పరిస్థితిలోనే వున్నాను నేను కూడా. నీ లాగానే నేనుకూడా నళిని జీవితం భగ్నం చేయాలని భావించాను. నీవు నా చెల్లెలి జీవితాన్ని కాపాడావో, నా కళ్ళే తెరిపించావో నా కర్థం కావటంలేదు. నేను నీకు ఋణపడి వున్నాను కుమార్-ఋణపడి వున్నాను."

జేబులోంచి అగ్గిపెట్టెతీసి వెలిగించి ఆ రెండు ఉత్తరాల దొంతరల్నీ అంటించాడు. అవి మండి మసి అవుతున్న సమయంలో రోహిణి గదిలోకి వచ్చి, "ఏంటన్నయ్యా! ఇక్కడ చలికాగుతున్నావు?" అంది నవ్వుతూ.

ఆమెది పెళ్ళి ఉత్సాహం.

"మంటకి అవినీతి ఎక్కడిదా అని యోచిస్తున్నాను చెల్లీ. చూడు మంటల్లోంచి ఎంతటి నల్లటి పొగ బయటికి వస్తోందో!!" అన్నాడు శ్రీధర్. *